క్లుప్తంగా

సోయా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): సోయా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతులు, భారతీయ కిసాన్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మండల వ్యవసాయ అధికారి కిషన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం మండల కార్యదర్శి రాజు యాదవ్ మాట్లాడుతూ.. రైతులు దళారులకు తక్కువ ధరకు అమ్మి మోసపోతున్నారని అన్నారు. ప్రభుత్వం సోయా కొనుగోలు కేంద్రాలు త్వరగా ప్రారంభించాలని కోరారు. సంఘం మండల సహాయ కార్యదర్శి మల్లికార్జున్ యాదవ్, గ్రామ అధ్యక్షుడు కుమార్ సింగ్, ఉప అధ్యక్షుడు అఫ్రోజ్, బాన్సువాడ డివిజన్ సభ్యులు సంజీవ్‌రెడ్డి, జక్కుల అంజీరం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక



కామారెడ్డి అర్బన్: టీఎస్‌కేసీ, ఇమార్టికస్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మంగళవారం ఉద్యోగ మేళా నిర్వహించారు. వివిధ ప్రయివేట్ బ్యాంకుల్లో ఉద్యోగాలకు 15 మంది ఎంపికయ్యారు. గ్రామీణ ప్రాంతాల వారి కోసం తమ కళాశాలలో ఉద్యోగమేళా నిర్వహించడం అభినందనీయమని ప్రిన్సిపల్ కే.విజయ్‌కుమార్ అన్నారు. సమన్వయకర్త రాజ్‌గంభీర్‌రావు, మెంటార్ అజహరోద్దీన్, ఇమార్టికస్ సంస్థ ప్రతినిధులు కుమార్, వినయ్‌లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



లింగంపేట(ఎల్లారెడ్డి): బోనాల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీవో మలహరి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, చిన్నారులకు ఇస్తున్న పౌష్టికాహారం, గ్రామంలో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది ఉన్నారు.

మండల సమాఖ్య పుస్తకాలు..



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మంగళవారం మండల సమాఖ్య పుస్తకాలను డీపీఎం రాజయ్య తనిఖీ చేశారు. మండలంలోని ఆయా గ్రామాలకు సంబంధించిన గ్రామ సమాఖ్య రికార్డులు, మండల సమాఖ్య పుస్తకాలను పరిశీలించారు. ఇంటర్నల్ ఆడిట్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఏప్రిల్, 2025 నుంచి సెప్టెంబర్ 30, 2025 దాకా మండల సమాఖ్యలో జరిగిన ఆర్థిక లావాదేవీలను పరిశీలించారు. ఆడిటర్లు మురళి, మాణిక్ రావు, అకౌంటెంట్ రమేష్, సీసీలు ఆంజనేయులు, భూమయ్య, నరేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక



పెద్దకొడప్‌గల్(జుక్కల్): విఠల్‌వాడి గ్రామానికి చెందిన బీజేపీ మోర్చా గ్రామ అధ్యక్షుడు కొండిగిరే మారుతి మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యలయంలో పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు చిప్ప మోహన్, మల్లప్ప పటేల్, మొగులాగౌడ్, సంతోష్ దేశాయ్, బస్వరాజ్ దేశాయ్, శంకర్ పటేల్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేయించుకోవాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మానసిక వ్యాధిగ్రస్తులు తరచుగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా మానసిక వైద్య నిపుణులు డాక్టర్ రమణ సూచించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో మానసిక వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వ్యాధిగ్రస్తులు కనీసం వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అదేవిధంగా మానసిక సమస్యలైన మతిమరుపు, నిద్రలేమి, అతి నిద్ర, ఫిట్స్, అతి కోపం, ఆత్మహత్య ప్రేరేపిత ఆలోచనలు అధిగమించాల్సిన తీరు, ఆల్కహాల్ మాన్పించుట కోసం, ఒంటరితనం భ్రమలో పడకుండా ఉన్నవి లేనట్లు లేనివి ఉన్నట్లు ఊహించుకోవడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వైద్య అధికారి ఆస్మా, సీహెచ్‌వో నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం సంగతేమిటి..?

- హైవే నిర్మాణ పనులతో ఉపాధి కోల్పోతున్న చిరు వ్యాపారులు
- ఇంటిగ్రేటెడ్ మార్కెట్, కొత్తగా నిర్మించబోతున్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లలో ప్రాధాన్యత ఇస్తామంటున్న అధికారులు
- అప్పటి దాకా వ్యాపారాలు చేసుకుంటామంటున్న చిరు వ్యాపారులు



ఎల్లారెడ్డి పట్టణంలో రోడ్డు పనుల కారణంగా తొలగించిన తాత్కాలిక షెడ్లు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణం మీదుగా సాగుతున్న హైవే నిర్మాణ పనులతో ప్రధాన రహదారి పక్కన తాత్కాలిక షెడ్లు వేసుకుని వ్యాపారాలు చేసుకుంటున్న చిరు వ్యాపారులు మళ్లీ రోడ్డున పడ్డారు. పట్టణంలో అంబేడ్కర్ చౌరస్తా నుంచి గాంధీ చౌక్ వరకు సుమారు వందకు పైగా వేసుకున్న తాత్కాలిక షెడ్లలో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ పలువురు ఉపాధి పొందుతున్నారు. పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు, డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టిన ప్రతిసారీ ఈ వ్యాపారస్తులు నిరాశ్రయులవుతున్నారు. పట్టణంలో రోడ్డుకు ఒక వైపు దాదాపు 50 శాతం ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. ప్రభుత్వ కార్యాయాల ప్రహరీల బయట తాత్కాలిక షెడ్లు వేసుకుని చిన్న వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఇందులో పండ్ల దుకాణాలు, టీ కొట్లు, చిన్న హోటళ్లు, పాన్‌షాప్‌లు లాంటి చిన్న వ్యాపారాల వారే ఉన్నారు. పట్టణంలో ఉన్న షెట్టర్లకు రూ.వేలకు వేల అద్దెలు కట్టే స్థాయి వ్యాపారాలు కాకపోవడంతో ఈ తాత్కాలిక షెడ్లలోనే ఏళ్ల తరబడి వ్యాపారాలు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. పట్టణంలో ఎలాంటి రోడ్డు నిర్మాణ పనులు జరిగినా మొదట బలయ్యేది వీరే అవుతున్నారు.

హామీలు.. నీటి మూటలే..

రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకునే వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని ప్రతిసారీ నేతలు ఇస్తున్న హామీలు నీటి మూటలుగానే మిగులుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో యుద్ధ ప్రాతిపదికన ఇరిగేషన్ కార్యాలయ ప్రాంగణంలో రూ.2 కోట్ల మున్సిపల్ నిధులతో నిర్మాణం మొదలు పెట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ (సమీకృత వ్యాపార సముదాయం) నిర్మాణ పనులు ప్రభుత్వం మారడంతోటే అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సముదాయంలో రోడ్డు పక్కన వ్యాపారస్తులకు దుకాణాలు పెట్టుకునే అవకాశం కల్పిస్తామని స్పష్టం చేసినా అది ఆగిపోవడంతో మళ్లీ వీరి బతుకు రోడ్డున పడింది. తాత్కాలిక షెడ్లను శాశ్వతంగా తొలగిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇదే జరిగితే తమకు వ్యాపారాలు చేసుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు లేక తాము జీవనోపాధి కోల్పోతామని చిరు వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై వారు స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌ను సంప్రదించగా వారికి శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని చెప్పారు. నిధులు రాకపోవడం కారణంగా నిలిచిపోయిన మార్కెట్ నిర్మాణ పనుల కోసం తన ప్రత్యేక సీడీఎఫ్(నియోజకవర్గ అభివృద్ధి ఫండ్) నుంచి రూ.1.6 కోట్లతో మార్కెట్ పనులను పూర్తి చేయించనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. అలాగే ఇంటిగ్రేటెడ్ మార్కెట్, మున్సిపల్ కార్యాలయం ముందు షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలకు నిధులు మంజూరైనట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని వారు తెలిపారు. అయితే మార్కెట్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు పూర్తయ్యేవరకు డ్రెయిన్లపై తాత్కాలిక షెడ్ల ద్వారా వ్యాపారాలు చేసుకునేందుకు తమకు అనుమతి ఇవ్వాలని వ్యాపారస్తులు కోరుతున్నారు.



పట్టణంలో సాగుతున్న హైవే నిర్మాణ పనులు

మాకు అవకాశం కల్పించాలి



రోడ్డు పక్కన మేము వ్యాపారాలు చేసుకుంటున్న షెడ్లను తొలగించి ఇంటిగ్రేటెడ్ మార్కెట్, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లలో షెట్టర్లు ఇస్తామంటున్నారు. కాని వాటి నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందో తెలియదు. అప్పటి వరకు డ్రెయినేజీల మీద షెడ్లు వేసుకునేందుకు మాకు అనుమతి ఇస్తే బాగుంటుంది.

– జహీర్, పండ్ల వ్యాపారి

పూలు దొరక్క ఇబ్బంది పడతారు



అన్ని మతాల వారికి నిత్యం అవసరమయ్యే పండ్లు, పూలు, కొబ్బరి బోండాల లాంటి వ్యాపారాలే మేము చేస్తున్నాం. మా షాపులు తొలగిస్తే ప్రజలకు పండ్లు, పూలు దొరకక ఇబ్బంది పడతారు. ఈ విషయమైనా దృష్టిలో పెట్టుకుని మాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని మా కోరిక.

– హఫీజ్, పూల దుకాణం

ప్రతిసారీ మొండిచేయే..



పట్టణంలో ఎలాంటి రోడ్డు పనులు జరిగినా మా షెడ్లనే పీకి పారేస్తారు. ఆశ్రయం కోల్పోయిన తమకు ప్రత్యామ్నాయం చూపిస్తామంటారు.. తర్వాత మొండి చెయ్యి చూపిస్తున్నారు. 15 సంవత్సరాలుగా ఇదే తంతు..మేము ఎలా బతికేది.?

– జక్కుల మల్లేష్, కొబ్బరి బోండాల వ్యాపారి

బాధితులకు ప్రాధాన్యత



పట్టణంలో రోడ్డు పక్కన తాత్కాలిక షెడ్లు వేసుకుని వ్యాపారాలు చేసుకుంటున్న చిన్న వ్యాపారులకు త్వరలో పూర్తి చేయనున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్, కొత్తగా నిర్మించబోతున్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లలో ప్రాధాన్యత ఇవ్వనున్నాం. నిర్మాణ పనులకు నిధుల మంజూరు కూడా జరిగినందును త్వరలోనే నిర్మాణ పనులు చేపట్టనున్నాం.

– మహేష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, ఎల్లారెడ్డి

సమాచారం..

నేడు గురుకులంలో న్యాయ చైతన్య సదస్సు

మద్నూర్(జుక్కల్): మండలంలోని పెద్ద ఎక్లార గేట్ వద్ద గల బాలికల గురుకుల పాఠశాల, మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో బుధవారంలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించనున్నట్లు న్యాయసేవా సంస్థ వాలంటీర్లు సురేష్, అశోక్, గురుకుల పాఠశాల ప్రిన్స్‌పాల్ స్వప్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ చైతన్య సదస్సు మధ్యాహ్నం 12 గంటలకు ఉందన్నారు. కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి నాగరాణి, బిచ్కుంద కోర్టు జడ్జి వినీల్ కుమార్ రానున్నారని వారు తెలిపారు.

తెరవే ఆధ్వర్యంలో కలాం జయంతి

కామారెడ్డి అర్బన్: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 5 గంటలకు స్థానిక ఓరియంటల్ హైస్కూల్ సమీపంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో శాస్త్రవేత్త, మాజీ రాష్ట్రపతి దివంగత ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి, కవితాగానాలు నిర్వహించనున్నట్లు తెరవే జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్ ఒక ప్రకటనలో తెలిపారు. కవులు, రచయితలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంగ్లిష్ పాఠ్యాంశాలు బోధించేందుకు అతిథి అధ్యాపకురాలి పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేక అధికారిణి వీణాబాయి తెలిపారు. పీజీసీఆర్‌టీ(ఇంగ్లిష్) సబ్జెక్టులో ఎంఏ బీఎడ్ విద్యార్హత కలిగిన అభ్యర్థులు ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 16 వరకు తమ విద్యార్హతల ధ్రువీకరణ పత్రాలతో పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులను మెరిట్ ఆధారంగా ఎంపిక చేసుకుంటామని తెలిపారు.

కుక్కల బెడద



బీబీపేట: మండలంలోని పలు గ్రామాల్లో విచ్చలవిడిగా కుక్కలు తిరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లోని సంచరిస్తూ పలువురిపై దాడులు చేసి తీవ్రంగా గాయపరుస్తున్నాయి. చిన్న పిల్లలు, వృద్ధులు బయటకు రావాలంటే జంకుతున్నారు. రాత్రి సమయాల్లో వాహనదారులు వెళ్తుంటే వెంట పడి మరీ కరుస్తున్నాయి. అధికారులు స్పందించి కుక్కలను అదుపు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎస్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తక రచనలో జిల్లా ఉపాధ్యాయుడు

కామారెడ్డి రూరల్: చిన్నమల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ప్రవీణ్ కుమార్ తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి(ఎస్‌సీఈఆర్‌టీ) ఆధ్వర్యంలో నిర్వహించిన 8 నుండి 10 వ తరగతి వరకు అవసరమయ్యే 'ప్రయోగ దీపిక' పుస్తక రూపకల్పనలో 15 మంది ఉపాధ్యాయులతో కలిసి పాల్గొన్నారు. అయితే ఇందులో ముగ్గురు ఉపాధ్యాయులు 8 వ తరగతికి సంబంధించిన ప్రయోగ దీపిక రచనలో పాల్గొనగా అందులో మన జిల్లాకు చెందిన చిన్నమల్లారెడ్డి గ్రామ బాలుర ఉన్నత పాఠశాల నుంచి ప్రవీణ్ కుమార్ ఈ కార్యక్రమంలో పాలు పంచుకోవడం విశేషం. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం సాయిరెడ్డి, ఉపాధ్యాయులు ప్రవీణ్ కుమార్‌ని అభినందించారు.

రుణాలతో ఆర్థికంగా ఎదగాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): స్త్రీనిధి పథకంలో రుణాలు తీసుకున్న వారు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీవో సురేందర్ సూచించారు. మంగళవారం ఆయన లింగంపేట మండల కేంద్రంలో స్త్రీనిధి పథకంలో రుణాలు తీసుకున్న వారి వ్యాపార సముదాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యాపారాలు విజయవంతంగా నడిపించి తోటి మహిళలకు ఆదర్శంగా నిలవాలన్నారు. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి తిరిగి అధిక మొత్తంలో రుణాలు పొందాలని సూచించారు. ఎంపీడీవో నరేష్, ఏపీఎం వినోద్‌కుమార్, స్త్రీనిధి మేనేజర్ అమల, వీఏవో అశోక్, తదితరులు ఉన్నారు.



లింగంపేటలో రుణాలు తీసుకున్న వారి దుకాణాలను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో సురేందర్

ఈ–కేవైసీ నమోదు వేగవంతం చేయాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని 41 గ్రామ పంచాయతీల్లోని ఉపాధి హామీ కూలీల ఈ–కేవైసీ నమోదును వేగవంతం చేయాలని డీఆర్‌డీవో సురేందర్ సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు, కార్యదర్శుల సమావేశంలో మాట్లాడారు. కూలీల ఈ–కేవైసీ చేయడంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. ఆగస్టులో కురిసిన భారీ వర్షాల కారణంగా గ్రామాల శివారులోని పంట పొలాల్లో ఏర్పడిన ఇసుక మేటలను తొలగించాలని సూచించారు. ఎంపీడీవో నరేష్, ఎంపీవో మలహరి, ఏపీవో నరేందర్, ఆయా గ్రామాల కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

దళారీ వ్యవస్థ నిర్మూలనకే కొనుగోలు కేంద్రాలు

- అదనపు డీఆర్‌డీవో విజయలక్ష్మి



మాట్లాడుతున్న అదనపు డీఆర్‌డీవో విజయలక్ష్మి

బిచ్కుంద(జుక్కల్): రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించడం, దళారుల వ్యవస్థ నిర్మూలన కోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు డీఆర్‌డీవో విజయలక్ష్మి అన్నారు. మంగళవారం బిచ్కుంద మండల పరిషత్ కార్యాలయంలో జుక్కల్, బిచ్కుంద, డోంగ్లీ, పెద్దకొడప్‌గల్ మండలాల ఏపీఎంలు, సీసీలు, ట్యాబ్ ఆపరేటర్లు, బుక్ కీపర్లతో కొనుగోలు కేంద్రాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో.. రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు, తూకం వేయడం, లారీలలో తరలింపు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించే విధంగా అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. డీపీఎం సాయిలు, ఏపీఎంలు రవీందర్, జగదీష్, గంగారాం, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల రవాణా బాధకు విముక్తి

బాన్సువాడ : విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి బస్సు సౌకర్యం కల్పించారు. బీర్కూర్ మండలం తిమ్మాపూర్ వేంకటేశ్వర ఆలయానికి వెళ్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డికి మార్గ మధ్యలో ఉన్న ఎస్ఆర్ఎన్‌కే వద్ద విద్యార్థులు బస్సుల కోసం ఎదురు చూస్తున్న విషయం గమనించి కారు ఆపి మాట్లాడారు. బస్సులు సరైన సమయంలో రావడం లేదని, తరగతులకు ఆలస్యం అవుతుందని విద్యార్థులు పోచారం దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ఆర్టీసీ డీఎం రవికుమార్‌తో మాట్లాడారు. విద్యార్థుల కోసం వెంటనే బస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. డీఎం వెంటనే బస్సులను పంపి విద్యార్థులను గమ్యస్థానాలకు పంపించారు.



డీఎంతో మాట్లాడుతున్న వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని నాగిరెడ్డిపేట ఎంపీవో ప్రభాకరచారి సూచించారు. బెజుగంచెరువుతండా, జప్తిజాన్కంపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. నిర్మాణాలను త్వరతగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం జీపీ కార్యాలయాల్లో రికార్డులను పరిశీలించారు. జీపీ కార్యదర్శులు అనిత, శంకర్ ఉన్నారు.

ఐకమత్యంగా కదిలి గుంతలను పూడ్చారు



రామారెడ్డి: తమతో పాటు వాహనదారులకు ఇబ్బందికరంగా మారిన గుంతలను రామారెడ్డి ఆటో యూనియన్ సభ్యులు మంగళవారం పూడ్చారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు గంగమ్మ వాగు సమీపంలో కిలోమీటర్ మేర భారీ గుంతలు పడ్డాయి. ఈ గుంతలపై ప్రయాణాలు సాగించాలంటే నరకం కనిపిస్తోంది. ఆర్‌అండ్‌బీ అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోకపోవడంతో రామారెడ్డి ఆటో యూనియన్ సభ్యులు ఐకమత్యంగా కదిలి కిలోమీటర్ దూరం వరకు డోజర్ ట్రాక్టర్ సాయంతో గుంతలను పూడ్చారు.

అడ్లూర్‌లో అంధకారం

- వెలగని వీధి దీపాలు
- పలుమార్లు విన్నవించినా పట్టించుకోని మున్సిపల్ అధికారులు



అడ్లూర్‌లో వెలగని వీధి లైట్

కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని అడ్లూర్ గ్రామం అంధకారంలో మగ్గుతోంది. కామారెడ్డి గ్రామీణ ప్రాంతంగా ఉన్న అడ్లూర్.. మున్సిపల్‌లో కలిశాక అభివృద్ధికి దూరమవుతుందనే మాటలు గ్రామస్తుల నుంచి వినిపిస్తున్నాయి. రెండో వార్డులోని అడ్లూర్ ప్రధాన రహదారి, కామారెడ్డి నుంచి అడ్లూర్‌కు ప్రవేశించే రోడ్డు మార్గంలో వీధి దీపాలు వెలుగక దాదాపు మూడు నెలలు గడుస్తున్నా మున్సిపల్ సిబ్బంది అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. వార్డులో వీధి దీపాల సమస్య ఉందని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే రోడ్ల పక్కన చెత్తాచెదారం, డ్రైనేజీలు అపరిశుభ్రంగా ఉండడంతో రోడ్లపైకి రాత్రి సమయంలో విషపూరితమైన పాములు వస్తున్నాయని కాలనీ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జిల్లా అధికారులు దృష్టి సారించి వీధి దీపాల సమస్యలను పరిష్కరించే విధంగా మున్సిపల్ అధికారులను ఆదేశించాలని కోరారు.

ఆర్చరీ శిక్షణ తరగతులు ప్రారంభం

బాన్సువాడ రూరల్: కొత్తాబాది జెడ్పీహైస్కూల్‌లో మంగళవారం జాతీయ ఆర్చరీ లెవెల్ -1 కోచ్, పాఠశాల పీడీ పీర్యానాయక్‌ల ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు ఉచిత ఆర్చరీ శిక్షణ తరగతులను బాన్సువాడ ఎంఈవో నాగేశ్వరరావు ప్రారంభించారు. గతంలో జాతీయ స్థాయి ఆర్చరీపోటీల్లో పాల్గొన్న పీర్యానాయక్ ఆయన శిష్యులు డి. శ్రీకాంత్, ప్రణీత్, సూర్య, కృష్ణసాయి తదితరులు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. అలాగే వారి ప్రదర్శన ద్వారా విద్యార్థులను, ఉపాధ్యాయులను ఆకట్టుకున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో కొన బాన్సువాడ జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు విజయ్‌కుమార్, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం కరేలా శ్రీనివాస్, పీడీ తారాచంద్, అనిల్, గంగామణి, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ ప్రారంభిస్తున్న ఎంఈవో నాగేశ్వరరావు

ఆస్పత్రిని సందర్శించిన మిడ్‌వైఫరీ ఎడ్యుకేటర్స్



బాన్సువాడ: బాన్సువాడ మాతా శిశు సంరక్షణ ఆస్పత్రిని సోమవారం మిడ్‌వైఫరీ ఎడ్యుకేటర్స్ సభ్యులు సందర్శించారు. ఆస్పత్రిలో సేవలు ఎలా అందుతున్నాయనే విషయంపై ఆరా తీశారు. రోగులతో మాట్లాడారు. ప్రసవాల గురించి అడిగి తెలుసుకున్నారు. మిడ్ వైఫరీ ఎడ్యుకేటర్స్ జ్యోతిర్మయి, అనూష, సుజాత, సుజన, కృష్ణ, సంగవ్వ, ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి తదితరులున్నారు.

సంక్షిప్తం

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి



బాన్సువాడ రూరల్: ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను లబ్ధిదారులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి, డీఈవో రాజు సూచించారు. మంగళవారం ఆయన నాగారం గ్రామంలో పర్యటించారు. గ్రామంలో కొనసాగుతన్న ఇంటి నిర్మాణాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వివిధ కారణాలతో ఇంకా పనులు ప్రారంభించని వారు వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు. ప్రభుత్వం బిల్లులను విడతల వారిగా మంజూరు చేస్తుందన్నారు. ఎంపీడీవో ఆనంద్, ఎంపీవో సత్యనారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నవీన్‌గౌడ్, గ్రామస్తులు ఉన్నారు.

నాణ్యతతో ఇంటి నిర్మాణం చేపట్టాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): లబ్ధిదారులు నాణ్యతతో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి కిషన్ తెలిపారు. మంగళవారం బేగంపూర్ తండాలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుడికి ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ పత్రం అందజేశారు.అనంతరం ఇల్లు నిర్మాణాన్ని ముగ్గుపోసి ప్రారంభించారు. లబ్ధిదారులకు విడతల వారీగా డబ్బులు వస్తాయని ఆయన తెలిపారు. ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి, కార్యదర్శి ఇందల్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో కొనసాగుతున్న అడ్మిషన్లు

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని ఐటీఐ కళాశాలలో ఏటీసీ టెక్నాలజీలలో అడ్మిషన్లు కొనసాగుతున్నాయి. ఆసక్తిగల విద్యార్థులు అడ్మిషన్లు పొందాలని ప్రిన్సిపాల్ ప్రమోద్ కుమార్ అన్నారు. ఏటీసీ కోర్సులు నేర్చుకున్న విద్యార్థులకు మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. ఏటీసీ నైపుణ్యాధారిత కోర్సులలో ఇంజనీరింగ్ డిజైనర్ టెక్నీషియన్, వర్చువల్ అనాలిసిస్ అండ్ డిజైనర్ మెకానికల్, అడ్వాన్స్ సీఎన్‌సీ మిషిన్ టెక్నీషియన్, ఎలక్ట్రీషియన్ కోర్సులలో ఖాళీలు అందుబాటులో ఉన్నాయి. ఈ నెల 17వరకు అడ్మిషన్లు పొందవచ్చని సూచించారు. స్టడీ సర్టిఫికెట్లతో ఐటీఐ కళాశాలకు నేరుగా హాజరై అడ్మిషన్లు పొందవచ్చని సూచించారు.

ఇంటి స్థలం ఆక్రమించుకున్నారని ఫిర్యాదు

భిక్కనూరు: మండల కేంద్రంలోని గిద్ద దళితవాడకు చెందిన కూసలకంటి గణేష్ తన ఇంటికి సంబంధించిన స్థలాన్ని చంద్రం అనే వ్యక్తి ఆక్రమించుకుని ఇళ్లు నిర్మిస్తున్నాడని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. వెంటనే విచారణ నిర్వహించి అధికారులు తన స్థలాన్ని తనకు ఇప్పించాలని ఆయన ఫిర్యాదు ద్వారా కోరారు. ఈ విషయమై పలు మార్లు మండల, గ్రామ స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదని ఫిర్యాదులో గణేష్ పేర్కొన్నారు.